# "దేశభక్తికెత్తిన పతాక - మహేంద్రోదయం"

**పల్లి చిన్నారావు**

**యు.జి.సి. జూనియర్ రీసెర్చ్ ఫెలో,**

**తెలుగుశాఖ - ఆంధ్ర విశ్వకళాపరిషత్తు.**

'విశ్వశ్రేయః కావ్యమ్' అని అలంకారికులు చెప్పినట్లుగా - కావ్యం లోక ప్రయోజనకారిగా వుంటుంది. మహా కవులు తమ కావ్యాల్లో నాటి సామాజిక, ఆర్థిక, రాజకీయ, దేశ పరిస్థితులను యితివృత్తంగా స్వీకరించి ప్రజలను జాగృతం చేస్తారు. ఇలాంటి కోవలోనికి చెందిందే - మహాకవి కళా ప్రపూర్ణ - డా॥దాశరథి గారి "మహేంద్రోదయం".

కవితా శరథి - దాశరథి గారు 1927లో మహబూబాబాద్ సమీపంలోని 'మానుకోట' గ్రామం సంప్రదాయ బ్రాహ్మణ కుటుంబంలో జన్మించారు. వీరి విద్యాభ్యాసం ... ఖమ్మం, హైద్రాబాద్‌లలో కొనసాగింది. పువ్వు పుట్టగానే పరిమళించునన్నట్లు' ..... వీరు చిన్న నాటి నుండియే కవితలల్లేవారు. రుద్రవీణ, పునర్నవం, అమృతాభిషేకం, కవితా పుష్పకం, అగ్నిధార, నవమి, నవమంజరి, దాశరథీ శతకం, తిమిరంతో సమరం, ఆలోచనా ..... లోచనాలు, గాలిబ్ గీతాలు, ధ్వజమెత్తిన ప్రజ.............. మున్నగునవి - వీరి కవితా కుసుమాలు. వీరు కేంద్ర, రాష్ట్రాల సాహిత్య అకాడమీల అవార్డులు పొందడమే గాక, ఆంధ్రప్రదేశ్ ఆస్థానకవిగా కొంతకాలం తెలుగుతల్లికి సేవచేశారు.

దాశరథి గారి 'మహేంద్రోదయం'లో నవరసాలు వున్నాయనడం ..... అత్యుక్తి గాదు. ఇది విభిన్న భావాలకు అద్దం పట్టే కావ్యరాజము. ఇందులో తెలంగాణా పోరాట ప్రీతి, దేశభక్తి, జాతీయతాభావం, విశాలాంధ్రాభిమానం, శాంతి ప్రీతి, మత సామరస్యం, మున్నగు విశిష్టాంశాలే గాక, భావ కవితా మూర్తికి నీరాజనం పట్టడం కూడా ఒక విశేషమే'. ముఖ్యంగా పద్యరచనా శైలి సరళంగానూ, పాఠక జన రంజకం గానూ, దేశభక్తి ప్రేరకం గానూ వుండి, నాటి నుండి నేటివరకూ వెలువడిన కావ్యాల్లో ఎన్నదగినది గానూ గల కావ్యం..... మహేంద్రోదయం ఒక్కటే!

తెలంగాణాలో దేశాభిమాన ప్రబోధ గీతములాలపించిన కవి కుమారులలో దాశరథిదే అగ్రస్థానము. ఇతడు తెలంగాణా సాహిత్య సీమలో క్రొత్తపుంతలు త్రొక్కి క్రొత్త పొలాలు నిర్మించిన ఉత్తమ సాహిత్య కర్షకుడు. దాశరథి కవిత లలిత పద చమత్కార సంపన్నమైందిగా..... చదివిన కొద్దీ చవులూరిందేగా వుంటుందని ..... మల్లంపల్లి వంటి విజ్ఞులు ప్రశంసించారు.

మహేంద్రోదయము ఆంధ్రావనిలో అవతరింప వలసిన మహేంద్రోదయ సౌభాగ్యలక్ష్మికి మంగళ ప్రబోధ గీతిక. మహేంద్రోదయమెప్పుడగునా? యని ఉవ్విళ్ళూరుతూ ..... ఆత్రంతో ఎదురుచూస్తున్న తెలుగు వారికి హృద్యమయిన అమృత రసగుళిక ..... అనడం - అక్షరాలా నిజం.

"నా తెలంగాణా కోటి రత్నాల వీణ", అని తెలంగాణాలో జన్మించడం - ఒక గొప్ప వరంగా భావించి, నాటి తెలంగాణా పోరాటంలో తుదకు కారాగారం పాలయి కూడా ఎన్నో బాధలను అనుభవించిన వజ్ర సంకల్పుడు - దాశరథి.

ఆనాడు - తెలంగాణాలో జరిగిన ఆస్తుల దోపిడీ, మానభంగాలు గృహ దహనాలు దాశరథి హృదయంలో నిప్పుకణికల్ని వెదజల్లి .... అవే జ్వాలలై..... ఆ జ్వాలల్లో నిజాం రాజును నుసి చేస్తాయని గర్జించిన తెలంగాణా విప్లవ కిశోరం దాశరథి కృష్ణమాచార్యులు!

తాను తన కన్నతల్లియగు 'తెలంగాణా' కై చేసిన కృషిని వర్ణిస్తూ .....

"నేను రా తెలంగాణ నిగళాలు తెగగొట్టి
ఆకాశమంత యెత్తరచినాను.
నేను రాక్షసి గుండె నీరుగా పద్యాలు పాడి
మానవుని కాపాడినాను.
నేను వేస్తంభాల నీడలో నొక తెల్గు
తోటనాటి సుమాలు దూసినాను.
నేను పోతన కవీశాను గంటములోని
ఒడుపుల కొన్నింటి బడసినాను.
కోటి తమ్ముల కడ రెండు కోట్ల తెల్గు
టన్నులను గూర్చి వృత్తాంతమందజేసి
మూడు కోటుల నొక్కటే ముడిబిగించి
పాడినాను మహాంధ్ర సౌభాగ్యగీతి" - అని చెప్పుకొన్నాడు దాశరథి.

అంతేగాకుండా -

మహారణ్యమయమయిన తెలంగాణా భూమిని మాగాణ మొనర్చిన రైతుదే- తెలంగాణము. కానీ, నిజాం నవాబుది కాదనీ, నిజామాబాద్ సెంట్రల్ జైల్లో సింహగర్జన మొనర్చినాడీ పద్యంలో .....

"ప్రాణములొడ్డి ఘోర గహనాటవులన్ పడగొట్టి మంచి, మా
గాణములన్ సృజించి, ఎముకల్ నుసిజేసి పొలాలు దున్ని, భో
షాణములన్ నవాబునకు స్వర్ణము నింపిన రైతుదే, తెలం
గాణము రైతుదే, ముసలినక్కకు రాచరికంబు దక్కునే!

నిజాంపై దాశరథికున్న కసి మరొక కవికి లేదని ఈ పద్యం ద్వారా స్పష్టమవుతోంది. అంతేగాక - "మా నిజాము రాజు జన్మ జన్మాల బూజు" - అని నిజాం నవాబును హేయమయిన బూజుతో పోల్చడం - దాశరథి కొక్కరికే చెల్లుతుంది.

తెలంగాణాను సరసులో పూచే అందమయిన పూలతల్లిగా కంజాతవల్లిగా .... మరొక చోట -

"ఎల్లొరా గుహలందున పల్లవించి
వేయిస్తంభాల గుడిలోన విరులుపూచి
శిల్పి యులి ముక్కలో వికసించినట్టి
నా తెలంగాణ కోటి అందాల జాణ".

మరో పద్యంలో - 'నా తెలంగాణ లేమ సౌందర్య సీమ' - అనీ,

ఇంకోసారి "మూగవోయిన కోటి తమ్ముల గళాల
పాట పలికించి కవితా జవమ్ము కూర్చి
నా కలానికి బలమిచ్చి నడచి నట్టి
నా తెలంగాణ కోటి రత్నాల వీణ"

- అని తన తెలంగాణా తల్లి వైశిష్ట్యాన్ని వ్యక్తం చేశాడు.

దాశరథి కేవలం తెలంగాణా కోసమే పరితపించిన కవి గాదు. భాషా ప్రయుక్త రాష్ట్రాలేర్పడినపుడు విశాలాంధ్ర ఆవిర్భవించాలని కోరుకున్న కవులలో అగ్రగణ్యుడని చెప్పుటకు ఈయన పద్యాలెన్నో ముచ్చుతునకలు.

"నా తల్లి కృష్ణవేణమ్మ కన్నీరొత్తి
కొనుచు నాపై ప్రేమమినుమడించె
గొదావరమ్మ సమ్మోదమ్ముతో నాకు
ముఖమార్జనకు జలమ్ముల నొసంగె
తుంగమ్మ తన పైటకొంగుతో నా మోము
తుడిచి నిద్దుర భారమడిచివేసె
పెన్నమ్మ తన పయఃపీయూషము నొసంగి
ఆకలి మంట చల్లార్చివైచె
మూడు చెరగుల నేలల మూడుకోట్లు
ముడివడినయట్లు కన్నులముందుతోచె
అందలము నెక్కి, యావజ్జనాళి మెచ్చ
సుందరవిభాత మేతెంచె తొందరించి". - అని పేర్కొన్నాడు.

అంతేగాకుండా - మన వారసులు, వీరులను గూర్చి వర్ణిస్తూ

"ఏది కాకతి? ఎవరు రుద్రమ?
ఎవరు రాయలు? ఎవడు సింగన?

అని తనను తాను ప్రశ్నించుకుంటూ - దానికి సమాధానంగా

"అన్ని నేనే - అంత నేనే
వెలుగు నేనే - తెలుగు నేనే
అరి శిరస్సుల నుత్తరించిన
అలుగు నేనే తెలుగు నేనే
అఖిల జగములు చుట్టివచ్చే
పులుగు నేనే, తెలుగు నేనే
తెలుగు నేనే, వెలుగు నేనే." - అని విశాలాంధ్ర శక్తిని గూర్చి

ఆరాధించిన తెలంగాణా పూజారి - దాశరథి.

"నాకు కావలె మహాంధ్రోర్వర
రండి అన్నల్లార! తూరుపు
దారి కెదురుగ ద్వారబంధము
మనిషి మనిషి మనస్సుదారుల
రాగబంధము - రాగబంధము" - అంటూ తన మహాంధ్రోదయాభిలాష

ను వ్యక్తం చేశాడు దాశరథి. మహాంధ్రోదయ సాధన అయిన తరువాత కోట్లాది జనము తెలుగు లక్ష్మి పాదాలకు వెలుగుల పారాణి నిడినట్లు వర్ణించడం - నిజంగా దాశరథికే చెల్లుతుంది. "కోటి గొంతులు" - అన్న ఖండికలో సైతం ఈ భావాలే వ్యక్తం అవుతాయి.

"భాషా రాష్ట్రమటన్న వాంఛితము
నుత్పాదించి మా తెల్గు వా
డాషామాషి కబుర్లు గాక నిజమౌన
ట్లేరు కవ్వించినన్
రోషంబొందక లోకంబు హర్షింప, ప్ర
త్యూషంబిన్ని దినాల కయినది స్వరా
ష్ట్రోద్యాన భాగంబునన్ - అని గొంతెత్తి పాడిన కవి కోకిల దాశరథి.

మరో పద్యంలో ........

"నా తెలంగాణ, కోటి రతనమ్ముల వీణ
మహాంధ్ర రాష్ట్ర సం
గీతము పాడెనేడు, పలికించెను
మూక గళాలు కోటి, ఆ
శా తరుణమ్ము జీవితమ్ము,
సఖ్యమునన్ విలసిల్లు సౌఖ్యమున్" -అని ఆంధ్రరాష్ట్రావతరణ శుభావసరాన్ని

గోరుచున్నారని, కోటి కంఠాలు ఒక్కటై వడిగా వారి అగ్రజుల్ని ఆహ్వానిస్తున్నారనీ మహాంధ్రోదయ ప్రీతితో దాశరథి కవితకు పట్టం కట్టారు.

విశాలాంధ్ర గురించి గొంతెత్తి పాడిన, అణువణువున జాతీయతాభావం నిండియున్న దండి దేశభక్తుడు - దాశరథి. దేశం కోసం ప్రాణ, ధన త్యాగ సమర్పణ చేసిన మహాపురుషుల్ని స్మరించడం దేశభక్తిలో ఒక భాగమే!

భారత స్వాతంత్ర్య రథసారథి అయిన మహాత్మాగాంధీ గురించి 'క్షమామూర్తి' పేరిట ఒక ఖండికను వెలువరించినాడు. దీన హృదయుల చీకటుల తొలగించెడి శాంతి తేజోరాశిగా గాంధీజీని వర్ణించినాడు. భారతీయతకై ఆయువు పట్టుకగా నిలిచినాడని చెప్తూ -

"మోకాలు దాటని పుల్లమల్లీకుసు
మాయ మానంబు కొల్లాయి జుట్టి
పచ్చని బంగారు వన్నె ఫాలంబున

బ్రహ్మ తేజో రాజి పదిల పరచి,
చేతిలో విజ్ఞాన సీమయై వెలుగొందు
గీతా ప్రబంధంబు కీలు కొలిపి,
పెదవుల రతనాల పేటిలో కదలాడు
అమృత హాసంబు కొంతవల చిలికి
భారతీయ కాయువు పట్టువోలె
బుద్ధదేవుని పర్యాయమూర్తి యగుచు
హిమగిరి శిఖాగ్రమే చేతులెత్తి నడచి
నటుల తోచు గాంధీ మూర్తి నర్చసేతు" -

అని దాశరథి రూప వ్యక్తిత్వాన్ని కన్నులకు కట్టినట్లుగా ప్రదర్శిస్తాడు.

తెలుగు రాష్ట్రం కోసం ఆత్మార్పణం చేసికొన్న అమరజీవి పొట్టి శ్రీరాములును కూడా ఈయన స్మరించినాడు. చిమ్మ చీకటిలో తూరుపు సెమ్మెమీద దివ్వెను వెలిగించి, వెలుతురుల బాకునాకాశవీథిలోకి విసిరినాడని పొట్టి శ్రీరాములును ప్రశంసించినాడు.

తెలుగు జనులను నిద్దుర మేల్కొలిపి వారిలో తెలుగుదనం నిలిచేట్టుగా జాగృత మొనర్చినాడు. అలాగే - కాకతీయ రాజుల పతనానంతరం తెలుగు జాతీయతను నిలబెట్టిన -కాపయ నాయకుని ప్రస్తుతించుట విశేషము.

శత్రువుల గుండెలో భయము కలిగించు, తిండిలేని పేదలకు అన్నము కల్పించిన కాపయ నాయకుడు - గొప్ప యోధుడు. ప్రజాస్వామ్యవాది. కాకతీయుల నుండి వశం చేసిన తుగ్లక్ రాజుల్ని ఓడించి, తెలుగు శౌర్యాన్ని రాజ్యాన్ని నిల్పినవాడు కాపయ నాయకుడు.

దేశ భౌగోళిక పరిసరాల్ని వర్ణించడం కూడా జాతీయతలో ఒక భాగమే! ఆ విధంగా దాశరథి 'మంజీరా' నదిని వర్ణించినాడు. గోదావరికి ఉపనది అయిన మంజీర నిజామాబాద్ జిల్లాలో ప్రవహిస్తుంది. ఈ నది వల్ల అక్కడి ప్రాంతం సస్య శ్యామలంగా వుంది. ఈ భావననే ఈ కవి తన మాటలలో

"నీవు పారిన దారిలో ఇక్షుదండాలు
నీవు జారిన జాడలో అమృత భాండాలు
నీవు దూకిన నేల మాకు విద్యున్మాల
నీవు ప్రాకిన పథము మాకు చైత్రరథము" - అని మంజీరానదిని గళమెత్తి ప్రశంసించినాడు.

సంఘంలో మానవులు అశాంతికి లోనయి, జీవనాన్ని అస్తవ్యస్తం చేసుకుంటున్నారు. ఇటువంటి జనులను అన్యాపదేశంగా దాశరథి గారు 'కపోతీ సందేశం' పేరిట చక్కని శాంతి ఖండికను వెలువరించారు. విజ్ఞానం పేరిట పరమాణు ఆయుధాలను కనిపెడుతూ ప్రపంచాన్ని బూడిద కావించే విద్య వలన శాంతి నశించిందని కవి వాపోయాడు.

"కాస్త పశ్చిమాద్రి కడికేగి నా బంధు
జాలమునకు గూడ శాంతి నేర్పి
ఇలను కాచుమోయి ఈ అణుప్రోద్గత
ప్రళయ వహ్ని నుండి - పక్షిరాజ్ఞి!"

- అను పద్యం ద్వారా పాశ్చాత్య దేవాలకు కూడా శాంతి సందేశాన్ని అందించారు. దాశరథి ఆశాజీవి.

"ఇక యుద్ధ భయంబుండదు
వికసించును శాంతి సుమము, విజ్ఞాన ధనం
బిక యెల్లవారి సొత్తై.
సుకమున గూరుచును నరులు సురలున్ మెచ్చన్"

- అంటాడు. ఇందులో భావి కాలంలో శాంతిరేఖలు వెల్లివిరిస్తాయని ఆశిస్తాడు.

జాతీయ విప్లవ కవితా విపంచిపై దాశరథి మత సామరస్య తంత్రులను మీటాడు. మతములబద్ధాలనీ, కులమనే మాటలు వట్టివేనని తేడనీ, సిపాయనీ వింత నామాలకై వెదకడం వట్టి బూటక నాటకాలేననీ.... చివరికి కేవలం ఒక్క రాగ బంధము మాత్రమే శాశ్వతంగా నిలుస్తుందనీ..... 'రాగబంధం' అన్న ఖండికలో కవి తలపోస్తాడు.

మూర్తి కట్టిన కవితామూర్తి తెనుగు తల్లి కన్న ముద్దుబిడ్డలలో ఒకడయిన దాశరథిలో ఎన్ని విభిన్న విశిష్ట భావాలుండాలో .... అన్నీ రంగరించుకున్న మహామనీషి. ఈ కవి లేఖని నుండి వెలువడ్డ మహాకావ్యం కావడమే .... మహాంధ్రోదయ వైశిష్ట్యం.

**ఆధారగ్రంథాలు :**


1. మహోంధ్రోదయం - దాశరథి కృష్ణమాచార్యులు
2. దాశరథి కృష్ణమాచార్యుని రచనలు -ప్రథమసంపుటి - ఆంధ్రసారస్వత పరిషత్
3. ఆధునికాంధ్ర కవితాసమీక్ష - కె.వి.ఆర్. నరసింహం - 1993
4. ఆధునిక కవిత్వంలో విభిన్న ధోరణుడు - కె.కె.రంగనాధాచార్యులు - 1995
5. నవ్యాంధ్ర సాహిత్యధోరణులు - కురుగంటి సీతారామయ్య - 1991